
# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగువైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 7 -

## రేఖా సంకరం

**బేతాళుడి శవాన్ని మళ్ళీ** తన భుజం మీద వేసుకుని విక్రమార్కుడు నడకసాగించాడు.

'విక్రమార్కా! నీకు శ్రమ కలుగకుండా ఉండటానికి మరో కథ చెబుతాను విను!' అని బేతాళుడు ప్రారంభించాడు -

'శ్రీ బాపుగారు ఓ కొత్త సినిమా ప్రారంభించారు. అంచేత తన అసిస్టెంట్ డైరెక్టర్ని దగ్గర కూచోబెట్టుకుని కొత్త హీరోయిన్‌ని ఎవర్ని పెట్టాలా అని డిస్కషన్ మొదలెట్టారు.

అ.డై (అసిస్టెంట్ డైరెక్టర్) అన్నాడు - గురూజీ! మన పాత హీరోయిన్ల కళ్ళు పెద్దవేకదా - వాళ్ళలో ఎవర్నో ఒకర్ని చూద్దామా?'

'కళ్ళు పెద్దవేకాని, వాళ్ళకీమధ్య ఒళ్ళు కూడా పెద్దదైపోయింది. సెవెంటి యమ్.యమ్‌లో తీసే అయిడియా లేదు' అన్నారు బాపుగారు.

'అవును సార్! అయినా తవ సినిమాలో ఒకసారి హీరోయిన్ వేశాక ఆ హీరోయిన్‌కి మళ్ళీ ఎడ్రసు ఉండదు కదుసార్.'

'అదేనోయ్ శిష్యా! నూతనత్వం అంటే.'

'సార్! మన హీరోయిన్‌కి కళ్ళు పెద్దవుండాలి సరే. మరి ఆవిడ జెడ కూడా పొడుగ్గా ఉండాలా?'

'ఉండాలయ్యా ఉండాలి. జెడ పొట్టిగా ఉంటే, పిరుదులకు వేరే షాట్స్ తియ్యాలి. జెడ పొడుగ్గా ఉంటే, జెడ షూట్ చేసినప్పుడు ఆ జెడే ఆవిడ పిరుదుల్ని కూడా చూపిస్తుంది.'

'సార్ - అమ్మకుట్టి అని మళయాళం పిల్ల. తెలుగు బాగావొచ్చు వేషం కోసం వచ్చి వరండాలో వెయిట్ చేస్తోంది. పిలవమంటారా?' అనడిగాడు అ.డై

'ముందే సెటప్ చేశావన్నమాట. ఆలస్యం ఎందుకు? పిలు!' అన్నారు బాపుగారు.

అ.డై వెళ్ళి అమ్మకుట్టిని ఇంటర్వ్యూ చైడానికి లోపలికి తీసుకొచ్చాడు.

అమ్మకుట్టి అచ్చం బాపుగారి బొమ్మలాగే ఉంది. విశాలనేత్రాలతో ఆమె కనుముక్కుతీరు, చనుకట్టు హోరు తన్మయంగా ఉన్నాయి.

'కూర్చోమ్మా!' అన్నారు బాపుగారు.

అ.డై ఇంటర్వ్యూ మొదలెట్టాడు -

'అమ్మా! కుట్టీ! అమ్మకుట్టీ' మీకు తెలుగు సినిమా లిష్టవా!? టామిళ్ బొమ్మలిష్టవా? మళయాళం క్లాసిక్ చిత్రాలిష్టవా?'

'ఇష్టాలు సూసేటోరికండి. నాకయితే గుడివాడిష్టవండి. ఇంక లెగండి.'

'గుడివాడ అనే భాషలో కూడా సినిమాలు తీస్తారా?'

'బాసలో కాదండి. గుడివాడ్ టేసన్లో తీత్తారండి ఇంక లెగండి.'

'లేస్తాం.. లేస్తాం. ఆగు. సినిమా సక్సెస్‌కి హీరోయిన్‌గా నువ్వెంత న్యాయం చెయ్యగలవు?'

'వీరోయిన్ కాదండి. సెక్కుసీగా ఉంటే అన్ని సినిమాలు సక్కుసులేనండి. ఇంక లెగండి.'

'ఇంకోటి అడుగుతా చెప్పు. సినిమా ఆడాలంటే హీరోయిన్ అందంగా ఉండాలా? బాగా నటించాలా?'

'రొండూ కాదండి. లైట్లారిపేసి కన్నంలోంచి ఆపరేటరు లైటుబీమెయ్యాలండి. ఇంక లెగండి.'

'ఇంతకీ అమ్మకుట్టీ! మీరేం సాధించాలనుకుంటున్నారూ?'

'నానెవర్నీ సాధించనండి అంతా సాఫ్ఫుగా సేసుకుపోతానండి. ఇంక లెగండి.'

'అవునమ్మా! - ఇందాకణ్నించి చూస్తున్నాను. ఇంక లెగండి. ఇంక లెగండి - అంటున్నావు. మమ్మల్ని లేవమనా? లేక నీకది ఊతపదమా?'

'షూటింగుల్లేనప్పుడు గుడివాడెల్లిపోతానండి. అక్కడ యాబిట్టయిపోయిందండి. ఇంక లెగండి.'

'మంచినీళ్ళేవన్నా తాగుతావా అమ్మా?'

'నాకు నీళ్ళసలు పడవండి. మత్తొచ్చేస్తాదండి.'

'ఏవిటే! నీళ్ళు తాగితే నీకు మత్తొస్తుందా?'

'ఆయ్. అవునండి. యిస్కీలో కలుపుకు తాగానండి. మత్తొచ్చేసిందండి. బ్రేందీలో కలుపుకు తాగానండి మత్తొచ్చేసిందండి. సివరికి జిన్నులో నీళ్ళు కలిపినా, రమ్ములో నీళ్ళు కలిపినా, వోడకడకాలో కలిపినా, వొయినులో కలిపినా ఒకటేమత్తండి. అంచాత ఇంకీ యెదవ నీళ్ళు తాక్కూడదని డిసైడై పోయానండి. ఇంక లెగండి.'

'సరే - వెళ్ళిరా అమ్మకుట్టీ - మన బాపుగారు, రమణగారితో మాట్టాడేక ఏ విషయం నీకు కబురు చేస్తాం.'

'థాంకులండి. దన్నాలండి. ఇంక లెగండి.' అని అమ్మకుట్టి సెలవుతీసుకుంది.

అమ్మకుట్టి వెళ్ళగానే, బాపుగారు తన అసిస్టెంట్ డైరెక్టర్ - అ.డై, - మీద పెన్నులూ, కుంచెలూ, డ్రాయింగు బోర్డు విసిరేశారు. దగ్గరున్న రంగులన్నీ చల్లి హోళీ ఆడేశారు.

అ.డై గదంతా చిందులు తొక్కి, 'శాంతించండి బాపుగారూ, అంతా నే చక్కబరుస్తాగా' అని హామీ ఇస్తూ ప్రాధేయపడ్డాడు.

'ఏం చక్కబరుస్తావ్?'

'అమ్మకుట్టి బాపు బొమ్మలా అంటే మీరు వేసే బొమ్మలా ఉంది కదు సార్!'

'ఉందయ్యా! కానీ నోరు విప్పితే దాని తెలుగంతా అమెరికన్ ఇంగ్లీషేకదా! నేనయ్యితే డబ్బింగు పెట్టను.'

'మీరే డబ్బింగూ పెట్టక్కరలేదు. నేను అమ్మ కుట్టికి చక్కటి తెలుగు డైలాగులు పాత్రోచితంగా పలికేలా ట్రైనింగిస్తాను. ఆ పూచీనాది. '

'ఈ పాత్రకి ఇంకెవరు దొరకరా?'

'దొరుకుతారు. డైలాగులు పలుకుతారు. కానీ ఫిగరే ప్రాబ్లం. ఇండస్ట్రీ అంతా వెతికితే మనం అనుకున్న పాత్రకు అమ్మకుట్టే అతుక్కున్నట్టుగా ఉంది.'

'రవణగారు ఏమంటారో!'

'మీరు ఓకే అంటే ఆయన ఓకే. మీ శరీరాలు వేరైనా శతనరాలు ఒకటే'

'అయితే అఘోరించు. ఆ పిల్ల నోరేదో ఉద్ధరించు' అన్నారు బాపుగారు.

అ.డై. అమ్మకుట్టికి వేషం నిర్ధారించాడు. అమ్మకుట్టి ఆనందంతో 'ఇంక లెగండి' అంది.

షూటింగ్ మొదలైంది.

అమ్మకుట్టి తెలుగింటి అప్సరసలా, అచ్చం బాపుబొమ్మలా తయారైంది. అ.డై, ఆమెకు డైలాగిచ్చాడు. 'చూడమ్మా! ఈ డైలాగు సరిగ్గా నేను చెప్పమన్నట్టే చెప్పాలి - ఇదీ డైలాగు - 'మీరు నా భర్త, నేను మీ భార్య, మనిద్దరి బాంధవ్యంలో బలం, బాధ ఎరుగని బంధం. అనురాగబంధం. అలా బాధపడకండి' --

షాటు తీశారు. అమ్మకుట్టి డైలాగు స్వచ్ఛంగా భావయుక్తంగా చెప్పింది. బాపుగారు అమ్మకుట్టిని చూసి ఖిన్నుడైపోయారు. కట్ అని ఆమెతో - 'అమ్మా! అమ్మకుట్టీ! మీరా 'బ్రా' తీసెయ్యండి' అన్నారు. వెంటనే సెట్ అంతా సైలెంట్ అయిపోయింది. బాపుగారేవిటీ? ఇలా ఎక్స్పైట్ అయిపోవడవేమిటీ? అనుకుంటూ ముక్కు ఎక్కడో, వేలు ఎక్కడో మరిచిపోయారు - అమ్మకుట్టి కూడా - ఇంకలెగండి అనడం మరిచిపోయింది.

- ఇప్పుడు చెప్పు విక్రమార్కా! ఋషిలాంటి బాపుగారు, అమ్మకుట్టిని అంత మంది ఎదుటా 'బ్రా' ఎందుకు తీసెయ్యమన్నారు. తన 'డొరియన్ గ్రే'ను తనే మోహించారా? - ఈ ప్రశ్నకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ తల బట్టతలైపోయి విగ్గుపెట్టుకుని అది ఊడి కిందపడిపోకుండా డ్యాన్సు చెయ్యాల్సొస్తుంది' - అని బేతాళుడు ముగించాడు.

'ఓ బేతాళా! బాపుగార్ని నువ్వుకూడా అపార్ధం చేసుకున్నావు. బాపుగారి ఉద్దేశం, అమ్మకుట్టి ఒంటిమీద బ్రా తీసెయ్యమని కాదు. అ.డై. ఎంత రిహార్సల్స్ చేయించినా, అమ్మకుట్టి ఆ డైలాగు ఇలా చెప్పింది - 'మీరు భ్రర్త, నేను మీ భ్రార్య, మనిద్దరి బ్రాంధవ్యంలో బ్రలం బ్రాధ ఎరుగని బ్రంధం - అనురాగ బ్రంధం - అలా బ్రాధపడకండి -' అని. భా, బ లకు ప్రతిచోటా రేఫ తగిల్చించేసింది. 'ర' పలుకవద్దనే ఉద్దేశంతో బ్రాపుగారు, సారీ బాపుగారు అలా అమ్మకుట్టిని 'బ్రా' తీసెయ్యమన్నారు.

'సుహృన్మిత్రార్యుదాసీన మధ్యస్థద్వేష్య బంధుషు!

సాధుష్వపి చపాపేషు సమ బుద్ధిర్విశిష్యతే!!

- సమ బుద్ధితో యోచించగలగడం విశిష్టత - అన్నారోయ్ గీతాచార్యులు శ్రీ కృష్ణభగవానుడు' అని విక్రమార్కుడు బ్రదులు చెప్పగానే, బ్రేతాళుడు గ్రబ గ్రబా ఎగిరి మళ్ళీ చెట్టెక్కేశాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments